క్లుప్తంగా

రైతు సంఘ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న రాజగోపాల్

కోవూరు: రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతర పోరాటాలు చేస్తోందని సంఘ జిల్లా మాజీ కార్యదర్శి రాజగోపాల్ పేర్కొన్నారు. పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో మహాసభను బుధవారం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బాబు, అధ్యక్షుడిగా చాంద్‌బాషా ఎన్నికయ్యారు. పాటూరు సురేష్, చాంద్‌బాషా, శేషయ్య, బాబు, ఫాతిమా, పెరుమాళ్ల హరి, పార్టీ మండల కార్యదర్శి బుజ్జయ్య, పంతంగి శీనయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు' విజయవంతంపై కృతజ్ఞతలు



రజత్‌కుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు నెల్లూరులో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులకు కృతజ్ఞతలను పార్టీ యువజన విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వానికి ఇది ఒక హెచ్చరిక అని చెప్పారు. రైతుల పక్షాన మరిన్ని ఆందోళనలను భవిష్యత్తులో చేపడతామని తెలిపారు.

చెన్నయ్యకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును విజయవాడలో అందుకున్న పట్టణంలోని కట్టుబడిపాళేనికి చెందిన చెన్నయ్యను స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం సత్కరించారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామిరెడ్డి



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పడుగుపాడుకు చెందిన రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

పాఠశాలలకే బియ్యం సరఫరాకు వినతి

నెల్లూరు(అర్బన్): మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యాన్ని పాఠశాలల వద్దకే సరఫరా చేయాలని ఆపస్ జిల్లా జనరల్ సెక్రటరీ రాజగోపాల్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. క్లస్టర్ పాఠశాలల వద్దకు బియ్యాన్ని చేర్చి వెళ్లిపోతున్నారని, అక్కడికెళ్లి తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచిస్తున్నారని చెప్పారు. గత సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు చాలా నియోజకవర్గాల్లో ఆర్వో డ్యూటీ సర్టిఫికెట్లను ఇవ్వలేదని తెలిపారు. కాగా వీటి మంజూరుపై ఎంఈఓలకు ఆదేశాలను కలెక్టర్ జారీ చేశారు. అనంతరం భరతమాత చిత్రపటాన్ని కలెక్టర్‌కు బహూకరించారు.

పోతనామాత్యుని సాహిత్య సభ

నెల్లూరు(బృందావనం): పోతన మహాకవి రచించిన భాగవతంలోని ఘట్టాల్లో రుక్మిణీ కల్యాణం సుప్రసిద్ధమైందని నెల్లూరు వేద సంస్కృత కళాశాల విశ్రాంత రీడర్ గిరిజా లక్ష్మి పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి జూనియర్ స్మారక మందిరంలో మహాకవి పోతనామాత్యుని సాహిత్య సభను నెల్లూరు వర్ధమాన సమాజం, మోపూరు వేణుగోపాలయ్య స్మారక ధర్మనిధి సౌజన్యంతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ కల్యాణం అనే అంశంపై ఆమె ఉపన్యసించారు. అనంతరం ఆమెను సత్కరించారు. సభాపోషకులుగా హరిప్రియ వ్యవహరించారు. మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, వెంకటస్వామి, గోవిందరాజు సుభద్రాదేవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల కబంధహస్తాల్లో..

- యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు
- కనిగిరి రిజర్వాయర్‌లో ఇదీ పరిస్థితి



ఆక్రమణకు గురైన రిజర్వాయర్ భూములు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కల్పతరువైన కనిగిరి రిజర్వాయర్ ఆక్రమణల చెరలో చిక్కుకుంది. సంగం, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి మండలాల్లో ఆయకట్టుకు కనిగిరి రిజర్వాయర్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. బ్రిటిష్ హయాంలో నిర్మించిన ఇది నేటికీ పదిలంగా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వవ్వేరులో గ్రావెల్‌ను యథేచ్ఛగా తవ్వి, ఈ భూములను ఆక్రమించుకున్నారు. ఈ తరుణంలో రిజర్వాయర్‌కు వరద పోటెత్తితే వవ్వేరు, మునులపూడి, దగదర్తి తదితర గ్రామాల్లో పొలాలు తీవ్రస్థాయిలో ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి నెలకొన్నా, అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారు.

పొలాలు, చేపల గుంతలుగా..

గ్రావెల్ తరలించిన ప్రాంతాలను చదును చేసి పొలాలు, చేపల గుంతలుగా మార్చి.. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారనే అంశాన్ని విజిలెన్స్ అధికారులు ఇటీవల గుర్తించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రిజర్వాయర్ భూముల ఆక్రమణ తదితరాలపై సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు విన్నవిస్తామని తెలిపారు. అయితే ఇది జరిగి దాదాపు నెలవుతున్నా, ఎలాంటి నివేదికను ఉన్నతాధికారులకు అందించిన దాఖలాల్లేవు. దీని వెనుక అధికార పార్టీ నేతలు ఉండటంతో చర్యలకు వెనుకాడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు విజిలెన్స్ అధికారుల తనిఖీలో రెవెన్యూ, మత్స్యశాఖ, ఇరిగేషన్ అధికారులెవరూ కనిపించకపోడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రెండోసారి విచారణ

ఈ అంశాలన్నీ ఓ ఎత్తయితే విజిలెన్స్ అధికారులు, తహసీల్దార్, తదితరులు వవ్వేరులో ఆక్రమిత భూములను మరోసారి మంగళవారం పరిశీలించారు. రిజర్వాయర్‌కు సంబంధించిన 920 సర్వే నంబర్‌లో రెండు వేల ఎకరాలున్నాయనే అంశాన్ని అప్పట్లో కలెక్టర్‌గా పని చేసిన ముత్యాలరాజు అధికారికంగా తెలిపారన్నారు. వీటిలో ఎన్నెకరాల్లో గ్రావెల్ తవ్వారు.. ఎంత భూమిని ఆక్రమించారో క్షుణ్ణంగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తెలిపారు.



విజిలెన్స్, రెవెన్యూ అధికారుల తనిఖీ

తప్పుడు కేసులు బనాయిస్తే మూల్యం తప్పదు



సమస్యలపై స్థానికులతో చర్చిస్తున్న కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించి వేధిస్తే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాటికొండ శివాజీ తల్లి మహాలక్ష్మమ్మ ఇటీవల మృతిచెందారు. బుధవారం జరిగిన ఆమె ఉత్తరక్రియల్లో గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. శివాజీ కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన నాయకులతో చర్చించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కొండూరు రామచంద్రారెడ్డి, జనార్దనరెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మందల వెంకటశేషయ్య, గుంజి రమేష్, పసుపులేటి రవి తదితరులున్నారు.

నామినేషన్ పద్ధతిలో పనుల కేటాయింపా..?

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ముంబై రోడ్డుకు ఇరువైపులా రూ.పది లక్షలతో చేపట్టనున్న పూడికతీత పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించడం తగదని 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడారు. ప్రతి పనికీ టెండర్లను గతంలో పిలిచేవారని, అయితే ప్రస్తుతం నామినేషన్ మేరకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇలా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు.

వామ్మో.. ఎండలు

పొదలకూరు: భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతలు మే నెలను తలపిస్తున్నాయి. నాలుగు రోజులుగా ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. వేడిమికి తాళలేక కొందరు ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటున్నారు. మధ్యాహ్నం రోడ్లపై నడవాలంటేనే హడలిపోతున్నారు. సాధారణంగా సెప్టెంబర్‌లో వర్షాలు కురిసి వాతావరణం చల్లబడుతుంది. మెట్టపంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతారు. కానీ అందుకు భిన్నంగా వాతావరణం ఉంది. రాత్రివేళల్లో సైతం ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

విడవలూరు: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ వెంకటనారాయణపురంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. దివ్యాంగురాలు తుల సింగారి రామమ్మ వెంకటనారాయణపురంలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో మధ్యాహ్నం నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఆమె బయటకొచ్చారు. వాషింగ్ మెషీన్, మంచం, సోఫా తదితర సామగ్రికి అగ్నికి ఆహుతయ్యాయి. ఆమెకొచ్చే పింఛన్‌తో సహా నగదు కాలిబూడిదైంది. ఘటన స్థలాన్ని వీఆర్వో కుమార్, సర్పంచ్ కర్పింగారి శీనయ్య పరిశీలించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

ఇందుకూరుపేట: తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట మండలాల పరిధిలోని పాడి రైతులకు 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందజేయనున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యాపకురాలికి వీసీ అభినందనలు

వెంకటాచలం: రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎంబీఏ విభాగం అధ్యాపకురాలు సుజా ఎస్.నాయర్‌ను బుధవారం వీసీ అల్లం శ్రీనివాసరావు అభినందించారు. ఆమె బోధనలో అంకితభావం చూపుతూ, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడంతో అవార్డు వరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో అవార్డును సాధించాలి



ఇందుకూరుపేట: రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్న నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ భవిష్యత్తులో జాతీయ స్థాయి అవార్డును దక్కించుకోవాలని ఎంఈఓ – 2 సునీల్‌కుమార్ కాంక్షించారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు. తొలుత తన గురువులు ప్రసాద్, సురేష్‌ను ముజీర్ సన్మానించి ఆశీస్సులను అందుకున్నారు.

విద్యాసామగ్రి అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇస్కపాళెం పంచాయతీ పల్లెపాళెంలోని ఎమ్పీపీఎస్ విద్యార్థులకు విద్యాసామగ్రిని సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు యస్దానీబాషా మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కాంక్షించారు. హెచ్‌ఎం నరసయ్య, ఉపాధ్యాయులు తులసి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన నేతలు



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు చేజర్ల సుధాకర్‌రెడ్డి, ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా సభ్యుడు తోడేటి మహేష్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పార్టీ యువజన విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డితో కలిసి వీరు భేటీ అయ్యారు. పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక



ప్రారంభిస్తున్న సునీల్‌కుమార్



అండర్ - 19 జట్లు

ఇందుకూరుపేట: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్ – 14, 17, 19 సెపక్‌తక్రా జిల్లా జట్లను మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని ఎంఈఓ – 2 సునీల్‌కుమార్ ప్రారంభించారు. పీడీలు సుకుమార్, అరోరా, రవిబాబు, దిలీప్‌రాజ్, వెంకటకృష్ణ, పల్లవి, రమేష్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పొదలకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కనున్న స్థలంలో తహసీల్దార్ బి.శివకృష్ణయ్య హెచ్చరిక బోర్డును బుధవారం ఏర్పాటు చేయించారు. ఈ స్థలం ముందున్న కూరగాయల దుకాణాన్ని తొలగించారు. న్యాయస్థానం పరిధిలో ఉన్నందున్న స్థలంలో ఇతరులెవరూ ప్రవేశించేందుకు వీల్లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జ్వరాలతో ఆస్పత్రుల బాట



పొదలకూరు సీహెచ్‌సీకి వచ్చిన రోగులు

పొదలకూరు: మండలంలోని గ్రామాల్లో టైఫాయిడ్ జ్వరాలున్నాయి. బిరదవోలు, మహ్మదాపురం గ్రామాల్లో ఈ పరిస్థితి ఉన్నట్టు ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. పల్లెల నుంచి ప్రజలు సీహెచ్‌సీ, ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్నారు. పట్టణంలో కూడా అక్కడక్కడా జ్వరాలున్నాయి. వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్ వస్తున్నట్టుగా తెలుస్తోంది. అయితే డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక ఫీవర్స్ నమోదు కాలేదు. గొంతునొప్పి, జలుబు, జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రులకుకు వెళ్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు డాక్టర్లు వెల్లడించారు. పారిశుధ్య లోపం వల్లే టైఫాయిడ్ ప్రబలుతున్నట్టుగా వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో దోమల లార్వా చేరి వృద్ధి చెంది జ్వరాలు వస్తున్నాయి. పొదలకూరు పట్టణంలో దోమల వల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. చీకటి పడితే దోమల మోతతో విసిగిపోతున్నారు. జ్వరాలు వస్తే ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వేలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ప్రమాదకర స్థాయిలో లేవు



టైఫాయిడ్ కేసులను గుర్తించాం. బిరదవోలు, మహ్మదాపురంలో మెడికల్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుంది. వైరల్ ఫీవర్స్ స్వల్పంగానే ఉన్నాయి. మొత్తంగా ప్రమాదకర స్థాయిలో మండలంలో జ్వరాల్లేవు. వర్షం కురిసి ఆగిపోతే జ్వరాలు పెరిగే అవకాశం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తే దోమల ఉధృతి తగ్గుతుంది.

– నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి, మహ్మదాపురం

పోస్టాఫీసు భవనం పెచ్చులూడి..



దెబ్బతిన్న భవన శ్లాబు



కుర్చీలు, కంప్యూటర్‌పై పడిన పెచ్చులు

- పోస్టుమాస్టర్‌కు గాయాలు

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని పోస్టాఫీసు భవనం శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో శ్లాబు పెచ్చులూడుతున్నాయి. మంగళవారం సాయంత్రం విధులు నిర్వహిస్తున్న పోస్టుమాస్టర్ నాగేశ్వరరావు తలపై శ్లాబు పెచ్చులు పడటంతో రక్తగాయమైంది. భవనానికి రిపేర్లు చేస్తున్నా శాశ్వత ప్రాతిపదికన చేపట్టడం లేదని సిబ్బంది వెల్లడిస్తున్నారు. నిత్యం భయపడుతూ విధులు నిర్వహించాల్సి వస్తోందని చెబుతున్నారు. అదృష్టవశాత్తు పోస్టుమాస్టర్‌కు ఏమీ కాలేదని పెచ్చులు పెద్దవి తలపై పడి ఉంటే ప్రాణాలకు ఇబ్బంది కలిగి ఉండేదని వాపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనానికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని నెల్లూరు డివిజన్ ఏఐపీఎస్సీఎస్టీ ఈడబ్ల్యూ గౌరవాధ్యక్షుడు దుడ్డు రమేష్‌బాబు డిమాండ్ చేశారు.

కూటమి తెచ్చిన కష్టం



అరటిపండ్లు విక్రయిస్తూ..

పొదలకూరు: కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎండీయూ వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఇంటింటికీ వెళ్లి రేషన్ బియ్యం అందజేశారు. అయితే చంద్రబాబు సర్కార్ మళ్లీ రేషన్ దుకాణాల్లోనే సరుకులను తీసుకునే విధానాన్ని తెచ్చింది. దీంతో ఎండీయూ వాహనదారులు రోడ్డున పడ్డారు. బండ్లను ఇతర వ్యాపారాలు, ప్రయాణికులను తరలించేందుకు వాడుకుంటున్నారు. అన్నమయ్య జిల్లా చిట్వేల్‌కు చెందిన వాహనదారుడు అరటి పండ్లను తీసుకొచ్చి పట్టణంలోని విక్రయిస్తున్నాడు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు



ఎంపీడీఓకు వినతిపత్రమిస్తున్న అరుణ్‌కుమార్

మనుబోలు: మనుబోలులోని గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. ప్రస్తుతం ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని బుధవారం లైబ్రేరియన్ వాసిలి అరుణ్ కుమార్ ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆమె జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా ఉంటారన్నారు.

కండలేరులో 43.150 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 43.150 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వేట బువ్వ లేదు

- అల్పపీడనాల ప్రభావం
- పస్తులతో మత్స్యకార కుటుంబాలు



కోడూరు సాగర తీరం



తీరంలో వేట సామగ్రి

తోటపల్లిగూడూరు: చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారులకు ప్రతి ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు తీరని వ్యథని మిగులుస్తున్నాయి. బంగాళాఖాతంలో తరచూ ఏర్పడుతున్న అల్పపీడనాల ప్రభావంతో వేట సాగక పస్తులతో గడపాల్సి వస్తోంది. మండలంలో 14 మత్స్యకార గ్రామాల్లో సుమారు 5,200 మంది జనాభా ఉన్నారు. అందులో 3,600 మంది వరకు 11 మరపడవులు మరో 475 సాధారణ బోట్ల ద్వారా వేట సాగిస్తున్నారు. వేట లేక వీరంతా నేడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగాళాఖాతంలో తరచూ ఏర్పడుతున్న అల్పపీడనాలు, వాయిగుండాల కారణంగా సముద్రం ఉగ్రరూపం దాల్చుస్తోంది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాలు సైతం వేటకు విఘాతం కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో వేటను నిలిపివేసి సామగ్రిని తీరం వద్ద భద్రపరుచుకోవాల్సి వచ్చింది. తుపాన్ల సమయంలో హెచ్చరికలు చేస్తూ వేటను అడ్డుకుంటున్న అధికారులు వారికి ఆర్థిక సాయం మాత్రం చేయడం లేదు. వేటనే నమ్ముకుని జీవిస్తున్న తాము ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఆదుకోవాలి



ప్రస్తుతం సముద్రంలో వేట సాగించేందుకు వాతావరణం అనుకూలంగా లేదు. అందుకే తప్పని పరిస్థితుల్లో మత్స్యకారులు విరామం చెప్పక తప్పలేదు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించాలి.

– వెంకటేశ్వర్లు, మత్స్యకార నేత, ఈదూరుపాళెం